క్లుప్తంగా

రేపు బాల్యవివాహాల నిర్మూలనపై సమావేశం

సూపర్‌వైజర్ రాణి

పెద్దేముల్: బాల్య వివాహాల నిర్మూలనపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ సుపర్‌వైజర్ రాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న ఉదయం 11గంటలకు ఎంపీపీ అనురాధ అధ్యక్షత నిర్వహించే ఈ సమావేశానికి ప్రతీ ఒక్కరు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

35 సెల్‌ఫోన్లను అప్పగించాం: ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు తక్షణమే సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే పోయిన సెల్‌ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉందని ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 35 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి అప్పగించామన్నారు. సీఈఐఆర్ వెబ్‌సైట్ ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 290 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న ఫోన్లను త్వరలోనే ఫిర్యాదుదారులకు అందజేస్తామన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

రూరల్ సీఐ రాంబాబు



బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న రూరల్ సీఐ రాంబాబు, ఎస్‌ఐలు

తాండూరు రూరల్: అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రజా మన్ననలు పొందాలని రూరల్ సీఐ రాంబాబు అన్నారు. కరన్‌కోట్ పీఎస్ నుంచి బదిలీపై వెళ్తున్న ఏఎస్‌ఐ, కానిస్టేబుళ్లను సోమవారం సీఐ తన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగం కత్తిమీద సాములాంటిదన్నారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఉన్నారు. అనంతరం వివిధ పోలీస్‌స్టేషన్ల నుంచి కరన్ కోట్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన కానిస్టేబుళ్లకు స్వాగతం పలికారు.

చన్గోముల్ ఎస్‌ఐగా గిరి

పూడూరు: కుల్కచర్ల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న గిరికి చన్గోముల్ ఎస్‌ఐగా పోస్టింగ్ ఇస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొంత కాలంగా పరిగి ఎస్‌ఐ విఠల్‌రెడ్డి చన్గోముల్ ఎస్‌ఐగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం కులకచర్ల ఎస్‌ఐ గిరిని చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

స్పెషల్ డ్రైవ్‌తో పారిశుద్ధ్య సమస్యలు దూరం

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమ వారోత్సవాల్లో భాగంగా 4వ, 12వ, 18వ, 25వ, 30వ వార్డుల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌కు కౌన్సిలర్లు అధికారులకు, సిబ్బందికి సహకరిస్తున్నారు. ఆమె వెంట కౌన్సిలర్లు కృష్ణ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్ తదితరులున్నారు.

కరాటే గ్రేడింగ్ టెస్ట్‌లో సత్తాచాటిన 'కస్తూర్బా'

కొడంగల్ రూరల్: కర్ణాటక రాష్ట్రంలోని యాద్గిర్‌లో ఆదివారం నిర్వహించిన కరాటే గ్రేడింగ్ టెస్ట్‌లో పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినిలు సత్తాచాటారని కరాటే మాస్టర్ కరీం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విద్యార్థులను అభినందించారు. అండర్ -17లో పాఠశాలకు చెందిన జ్యోతి ఆరెంజ్ బెల్ట్, అండర్-18 విభాగంలో కృష్ణవేణి బ్లూ బెల్ట్ సాధించారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులతోపాటు కరాటే మాస్టర్ కరీంను యాద్గిర్ పట్టణ ఎస్‌ఐ సంతోశ్‌కుమార్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ప్రవంతి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ టీఎన్‌జీఓస్ కాలనీ ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీలతో పాటు నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. టీఎన్‌జీఓస్ కాలనీ ప్రాంతంలోని సర్వే నంబర్ 150/1లో ప్రభుత్వ స్థలంలో కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రహరీలతో పాటు గదులను నిర్మించారు. స్థానిక బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు స్పందించిన రాజేంద్రనగర్ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్‌ఐ సారిక ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. సోమవారం ఉదయం అక్రమ నిర్మాణాలను కూల్చివేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలను చేపడితే సహించేది లేదన్నారు. ప్రస్తుతం 150/1 సర్వే నంబర్‌లో నిర్మించిన నిర్మాణాలను కూల్చివేశామని.. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సమస్యలు తలెత్తకుండా 'స్పెషల్ డ్రైవ్'

గ్రామాల్లో శానిటేషన్ సమస్య తలెత్తకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పంచాయతీ రాజ్ శాఖ నిర్ణయించింది. వరదలు, వర్షాలపై పంచాయతీరాజ్ అధికారులకు ఇచ్చిన ఆదేశాలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

- గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు
- పర్యవేక్షిస్తున్న అధికారులు



గుముడాలలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కార్మికులు

దౌల్తాబాద్: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు అధికారులు, పంచాయతీలు నడుంబిగించాయి. ఇందుకు ఈ నెల 17నుంచి 23వరకు శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రజలు అధికారుల దృష్టికి తీసకువచ్చిన సమస్యలతో పాటు పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఇందుకు ఆయా పంచాయతీల వారీగా సర్పంచ్‌లు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

డ్రైనేజీల నుంచి శ్మశానవాటికల వరకు

ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా, గ్రామాల్లోని డ్రైనేజీలు మొదలుకుని శ్మశాన వాటికల వరకు అన్ని సమస్యలు పరిష్కరించుకునేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది ముందుకు కదులుతున్నారు. గ్రామాల్లోని కాలనీల్లో చెత్త తొలగించడం, కాలనీలలోని రోడ్లపైన ఎక్కడైన గోతులు పడితే పూడ్చడం, డ్రైనేజీలు, మురుగు కాల్వలలో పేరుకున్న చెత్త, వ్యర్థాలు తీసేయడం, వర్షకాలంలో కాలనీల్లో నీరు నిల్వకుండా దారులను బాగు చేయడం, ఇంకుడు గుంతల ఏర్పాటు, కూలిపోయి శిథిలావస్థలో ఉన్న ఇళ్లను తొలగించే చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా గ్రామాల్లో నీటి ట్యాంకులు, నల్లాల వద్ద మురుగును తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల, ఈగల బెడదకు నివారణ చర్యలు తీసుకుంటున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి, పంచాయతీ చెత్త సేకరణ ట్రాక్టర్‌లో వేయాలని సూచిస్తున్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్ల వెంట పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో ప్రత్యేకంగా కూలీలను నియమించి మొక్కల తొలగింపు పనులు చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ.. ఉపయోగంలో లేని వస్తువులు చెత్తకుప్పలు, వ్యర్థాలను తొలగిస్తున్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా లోతట్టు ప్రాంతాల్లో మట్టిని నింపుతామని అధికారులు చెబుతున్నారు.

వీధులు శుభ్రమయ్యాయి



స్పెషల్ డ్రైవ్‌తో గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. పారిశుద్ధ్య పనులు చేపట్టి స్వచ్ఛ గ్రామాలుగా మారుస్తున్నాం. ఖాళీ స్థలాల్లో చెత్త, వ్యర్థాలు తొలగిస్తున్నాం. డ్రైనేజీలు పేరుకుపోయిన వ్యర్థాలు తొలగిస్తున్నాం. నల్లాలతో పాటు, గ్రామాల్లోని కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి వీధులను శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– శిరీష, సర్పంచ్, దౌల్తాబాద్

ముమ్మరంగా పనులు



స్పెషల్ డ్రైవ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వర్షాకాలంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. చెత్త తొలగించడం, రోడ్లపైన ఎక్కడైనా గోతులు పడితే పూడ్చడం, డ్రైనేజీలు, మురుగు కాల్వలలో పేరుకున్న చెత్త, వ్యర్థాలు తీసేయడం, రానున్న వర్షకాలంలో కాలనీల్లో నీరు నిల్వకుండా దారులను బాగు చేయడం తదితర పనులపై ప్రత్యేక దృష్టి సారించాం.

– రవీందర్, ఎంపీఓ, దౌల్తాబాద్

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు

ప్రత్యేక పూజలు చేసిన మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని కొటాలగూడెంలో జగదాంబమాత, సంత్ సేవాలాల్ మహరాజ్‌ల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు మూడు రోజులుగా ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారు జాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 9గంటలకు ప్రత్యేక పూజలు చేసి యంత్ర ప్రతిష్ఠ చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహం, సంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపనగావించారు. అనంతరం ఆలయం ఎదట ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీమంత్రి ప్రసాద్‌కుమార్, ఎంపీపీ చంద్రకళ కమాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉత్సవకమిటీ సభ్యులు

ద్యాచారంలో అధికారుల పర్యటన

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని ద్యాచారం గ్రామంలో సోమవారం అడిషనల్ డీఆర్‌డీఓ స్టీవెన్‌నీల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పల్లె ప్రకృతి వనం, ఎవెన్యూ ప్లాంటేషన్, కంపోస్టు షెడ్, టీజీకేపీ, క్రిమిటోరియం, సీసీ రోడ్లు, మ్యాజిక్ సోక్‌పిట్‌లను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ పనుల కింద చేపట్టిన రోడ్లను, కాల్వలు, పూడికతీత తదితర పనులను పరిశీలించి సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట ఎంపీడీఓ సత్తయ్య, ఏపీఓ శీను, సర్పంచ్ అంజయ్య, పంచాయతీ కార్యదర్శి పుష్ప, ఈసీ నవీన్, ఎఫ్‌ఏ మహేందర్ తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై పచ్చి రొట్ట ఎరువులు



యాలాల: జనుము బస్తాలను రైతులకు అందజేస్తున్న సురేందర్‌రెడ్డి

యాలాల: రైతులకు సబ్సిడీపై పచ్చి రొట్ట ఎరువులు(జనుము, జీలుగ) అందుబాటులో ఉన్నాయని సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి యాదగిరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సబ్సిడీపై వచ్చిన జనుము, జీలుగ విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనుము 40 కేజీల బస్తా రూ.1224, జీలుగ రూ.842లకు అందిస్తున్నట్లు వివరించారు. అవసరమనుకున్న రైతులు పట్టాపాసుపుస్తకం జిరాక్స్, ఆధార్, ఫోన్ నెంబరు వివరాలతో సంబంధిత ఏఈఓలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మదన్‌మోహన్, సొసైటీ సిబ్బంది వేణు, భాస్కర చారి, ఉప సర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు.

సబ్సిడీపై జనుము, జీనుగ విత్తనాలు

పూడూరు: ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలను అందజేస్తుందని.. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మల్లేశం అన్నారు. సోమవారం మండల పరిధిలోని మన్నెగూడ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రైతులకు జనుము, జీనుగ విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, పూడూరు ఏఈఓ రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్, పలుగ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించేందుకు క్విజ్ పోటీలు

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: యువతను ప్రోత్సహించేందుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కంకల్ గ్రామంలో ఈ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీసీ మాట్లాడుతూ.. యువత పోటీల్లో పాల్గొని బహుమతులు పొందాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ పునఃప్రతిష్ఠాపన

పూడూరు: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం సిరిగాయపల్లిలో కెరవెళ్లి మైసమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవిత, పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు సురేందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, మాజీ సర్పంచ్‌లు పెంటయ్య, మధుసుదన్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్, రుక్మారెడ్డి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు వినియోగించుకోండి

సర్పంచ్ పద్మ

దోమ: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని బాస్‌పల్లి సర్పంచ్ పద్మ అన్నారు. సోమవారం ఆమె రైతులు పొలాలకు వెళ్లే ఫార్మేషన్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బందులు కలుగుతుండడంతో ఫార్మేషన్ రోడ్డు పనులను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బిచ్చిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు, వార్డు సభ్యులు వెంకటయ్య, యాదయ్య, శ్రీనివాస్, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి పనులు

కొడంగల్ రూరల్: ఉపాధిహామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఆదివారం మండల పరిధిలోని హుస్నేన్ గ్రామ శివారులో ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రహదారికి ఇరువైపులా కంప చెట్లను తొలగిస్తూ గుంతలు తీస్తూ మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ రాములు ఆదివారం రావులపల్లిలో కొనసాగుతున్న ఫార్మేషన్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హుస్నేన్‌పూర్ పంచాయతీ కార్యదర్శి కొండప్ప, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ పద్మ

జీపీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

చేవెళ్ల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏ దేవేందర్ డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ వేణుమాధవ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం 15,600 ఇవ్వాలని, 10లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి కార్మికుడికి తప్పని సరిగా గుర్తింపు కార్డు అందజేయాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే వారి తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ చేవెళ్ల మండల అధ్యక్షుడు నర్సింలు, షాబాద్ మండల అధ్యక్షుడు నర్సింహ, స్వరూప, అడివమ్మ, మల్లమ్మ, దస్తగిరి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా రూపొందిస్తాం

బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు శ్రీనివాస్‌రెడ్డి, అష్ఫక్‌రసూల్

బంట్వారం: ఓటరు నమోదు జాబితా పక్కాగా రూపొందిస్తామని బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు శ్రీనివాస్‌రెడ్డి, అష్ఫక్ రసూల్ అన్నారు. సోమవారం ఆయా రాజకీయ పార్టీల నాయకులతో వారు వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఇక నుంచి బీఎల్‌ఓలు బూత్ స్థాయిలో ప్రక్షాళన చేస్తారన్నారు. ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి పూర్తి వివరాలు సేకరిస్తారన్నారు. ఓటరు లిస్టు పకడ్బందీగా తయారుచేస్తామన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పాలని సూచించారు. ప్రతీ సోమవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ భరత్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బోగస్ ఓటర్ల ఏరివేతకు సహకరించాలి

యాలాల: ఓటరు జాబితాలో డబుల్ ఓటర్లు, బోగస్ ఓటర్ల ఏరివేతలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీల ప్రతినిధులు సహకరించాలని యాలాల డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్ నాయక్ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో ఇప్పటికే డబుల్ ఓటర్లు, చనిపోయిన వారి వివరాలను సేకరిస్తున్నామన్నారు. ఈ విషయంలో ఎప్పటికప్పుడు పార్టీల ప్రతినిధులు సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇక నుంచి ప్రతీ సోమవారం సాయంత్రం 4గంటలకు అన్ని పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకుల ప్రతినిధులు భీమప్ప, మహిపాల్, బుగ్గప్ప, ఆర్‌ఐలు నారాయణరెడ్డి, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.



బంట్వారం: కోట్‌పల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ అష్ఫక్ రసూల్



యాలాల: పార్టీ ప్రతినిధులతో సమావేశమైన లక్ష్మణ్‌నాయక్

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ముజాహిద్‌పూర్ సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండలం పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో వారు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు దళారులను నమ్మిమోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఉప సర్పంచ్ చంద్రభూపాల్, దాస్యనాయక్ తాండ రాజు, మల్లేశం, సోమలింగం, షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

బైక్ దొంగలకు రిమాండ్

రాజేంద్రనగర్: బైక్‌పై వెళుతున్న వారిపై దాడి చేసి వాహనంతో పరారైన ఇద్దరు నిందితులను రాజేంద్రనగర్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి పల్సర్ వాహనంతో పాటు యాక్టివాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. రాజేంద్రనగర్ హైదర్‌గూడ ప్రాంతంలోని సమిష్టి బార్ అండ్ రెస్టారెంట్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న షేక్ సదుల్ ఈ నెల 14న రాత్రి బార్ మూసివేసిన అనంతరం బార్‌లో పని చేస్తున్న మణెమ్మ అనే మహిళను గోల్డెన్ హట్స్ ప్రాంతంలోని ఆమె ఇంటి వద్ద విడిచిపెట్టేందుకు బైక్‌పై బయలుదేరాడు. గోల్డెన్ హట్స్ ఆడమ్ స్కూల్ వద్దకు రాగానే బాలాపూర్ షాహీనగర్‌కు చెందిన మహ్మద్ తాహా, నాంపల్లి సుల్తాన్ బజార్‌కు చెందిన ముజుతాబా హుస్సేన్ వారిని అడ్డుకుని వివరాలు అడిగారు. రాత్రి వేళల్లో ఎక్కడ వెళుతున్నావ్ అంటూ అతడిపై దాడి చేశారు. బైక్ లాక్కుని అదే వాహనంపై అక్కడి నుంచి పరారయ్యారు. షేక్ సదుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాజేంద్రనగర్ పోలీసులు సోమవారం ఉదయం ఆరాంఘర్ ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి పల్సర్ వాహనంతో పాటు మరో యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిపై నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయని... వాటి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

సమాజం పట్ల అవగాహన అవసరం

చైల్డ్‌లైన్ మండల కోఆర్డినేటర్ రాంచంద్రయ్య

కుల్కచర్ల: సమాజంలో చోటు చేసుకుంటున్న మంచి చెడులపై అవగాహన పెంపొందించుకోవాలని చైల్డ్‌లైన్ మండల కోఆర్డినేటర్ రాంచంద్రయ్య అన్నారు. సోమవారం పుట్టపహాడ్ గ్రామంలో ఉపాధిహామి కూలీలకు బాలల హక్కుల పరిరక్షణ, బాల్యవివాహాల వల్ల నష్టాలు, ఆర్థిక అక్షరాస్యత, మూఢనమ్మకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉపాధికూలీలు

ప్రజావాణికి ఆరు ఫిర్యాదులు



వికారాబాద్ అర్బన్: ఫిర్యాదు స్వీకరిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వస్తున్న ఫిర్యాదులకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆరు దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగంలో ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జాన్ కృపాకర్, డీఈఈ తబిత, టీపీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హరిదాసుపల్లి నుంచి ఒక దరఖాస్తు

ధారూరు: మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక దరఖాస్తు వచ్చినట్లు తహసీల్దార్ భువనేశ్వర్ తెలిపారు. హరిదాస్‌పల్లి గ్రామానికి చెందిన రైతు తన 30 గుంటల భూమిని సర్వే చేయించాలని, ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణం పొందేందుకు ఈ సర్వే చేయించాలని కోరారని చెప్పారు.

'భగీరథ'.. నీరు వృథా

మండల పరిధిలోనలి తొండపల్లి శివారులో మిషన్ భగీరథ నీరు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వృథా అయింది. ఫౌంటేన్‌ను తలపిస్తూ నీరు విరజిమ్మింది. దీంతో గ్రామాల్లో నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సాయంత్రానికి అధికారులు మరమ్మతులు నిర్వహించి లీకేజీని అరికట్టారు. సోషల్ మీడియాలో వైరల్ అయితే తప్ప విషయాన్ని సంబంధిత శాఖ అధికారులు గ్రహించకపోవడంతో ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

– పరిగి



తొండపల్లి శివారులో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకై విరజిమ్ముతున్న నీరు